కథ

# పాపం బుజ్జి

కోలపల్లి ఈశ్వర్



''ఏమండీ మీ దగ్గర 'తడిగుడ్డతో గొంతులు కొయ్యడం ఎలా?' అనే పుస్తకం ఉందా?'' బుచ్చిబాబు ప్రశ్నకి బుర్రకాయలో బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డాడు. ఆ బుక్ షాపులో బుక్కులమ్మే మూర్తి.

అవును మరి!

తడిగుడ్డతో గొంతు కోసే మనుషులుంటారేమో గానీ, అలాంటి పుస్తకాలు ఉంటాయా ఎక్కడైనా? అలాంటిది అదే పనిగా వచ్చి ఒక కస్టమర్ అలా అడుగుతుంటే బుర్రకాయలో బాంబు పేలదూ మరి?

''లేదు..'' అన్నాడు మూర్తి బుచ్చిబాబుకేసి ఎగాదిగా చూస్తూ.

''పోనీ'' 'తిన్నింటి వాసాలు లెక్కించడం ఎలా?' అనే పుస్తకమేమైనా ఉందా?'' మూర్తి ఎగాదిగా చూపుల్ని కేర్ చెయ్యకుండా అడిగాడు బుచ్చిబాబు.



ప్రశ్న అంత క్రితందే- ఎటొచ్చీ మారిందల్లా పుస్తకం పేరు!

'సందేహంలేదు... ఇతను కచ్చితంగా పిచ్చివాడే...' అనుకున్నాడు మూర్తి మనసులో కన్‌ఫర్మ్‌గా!

పైకి మాత్రం ''లేదు'' అన్నాడు ముచ్చటగా మూడోసారి.

దాంతో బుచ్చిబాబు ముఖంలో బోలెడంత నిరాశ తాండవించింది.

''పోనీ 'అందమైన అమ్మాయిల్ని మోసగించడం ఎలా?' అనే పుస్తకమైనా ఉందా కనీసం'' అడిగాడు పట్టువదలని విక్రమార్కుడిలా.

మూర్తికి చిర్రెత్తుకొచ్చిందీసారి ''అలాంటి నీచ, నికృష్ట, ఛండాలప్పుస్తకాలిక్కడ, దొరకవ్...'' అన్నాడు కోపంగా.

''పొద్దున్నే ఇలాంటి మెంటల్‌గాడి పాలబడ్డా నేంట్రా? ఉదయాన్నే లేచి ఎవరి ముఖాన్ని చూశాన్రా బాబూ?'' అనుకున్నాడు మనసులో.

మనసులో అతనలా అనుకున్నాడని బుచ్చి బాబుకేం తెలుసు? అందుకే ''పోనీ ఎక్కడ దొరుకు తాయో చెప్పగలరా?'' అన్నాడు ఠీవిగా నిలబడుతూ.

అది చూసి 'బుర్రలో మెదడు లేకపోయినా ఠీవీకి మాత్రం లోటు లేదు' అనుకున్నాడు మూర్తి.

అనుకున్నాక ''అలాంటి పుస్తకాలు ఇక్కడేకాదు ఎక్కడా దొరకవ్...'' అన్నాడు ముక్కు మీద గీరుకుంటూ.

ముక్కు మీద నిజంగా దురదపుట్టి కాదు! కళ్లెదుట ఓ పిచ్చివాడు నిలబడి ఉన్నప్పుడు భయం కలగటం సహజమే కదా! ఆ భయంలో అనాలోచితంగా అలా గీరేసుకున్నాడన్న మాట.

''ఎక్కడా దొరకవా? సారీ అండీ మీకు ట్రబులిచ్చి నట్టున్నాను...'' అనేసి ఆ షాపులోంచి బైటికొచ్చేశాడు బుచ్చి!

వెళ్ళిపోతున్న బుచ్చిబాబుకేసి ఓ వెర్రిచూపు చూసి 'పాపం పిచ్చివాడు' అనుకున్నాడు మూర్తి.

* * *

బుచ్చి చెప్పింది విని పొట్టచెక్కలయ్యేలా నవ్వాడు పవన్.

''ఎందుకలా నవ్వుతావ్? పదిమందితో చెడ్డవాడు అనిపించుకోవాలంటే ఏం చెయ్యాల్రా అనడిగితే నువ్వేగా చెప్పావ్....'' ఉక్రోషం వల్ల గొంతు పూడుకు పోవడంతో మాట పూర్తి చెయ్యలేక పోయాడు బుచ్చి.

''ఏం చెప్పాను?'' అన్నాడు పవన్ మనసులో 'వీడొక తింగరమేళం' అనుకుంటూ

''తడిగుడ్డతో గొంతులు కొయ్యటం, నమ్మిన వాళ్ళని నట్టేట ముంచటం, తిన్నింటి వాసాలు లెక్కించటం, అందమైన అమ్మాయిల్ని మోసగించటం లాంటి పన్లు చేస్తే తప్ప సమాజం నిన్ను చెడ్డవాడిగా గుర్తించదురా అని నువ్వేగా చెప్పావ్....''

''అంటే....?''

''అలాంటి పన్లు చెయ్యడం నాకు చేతకాదు కాబట్టి అలాంటి పనులు చెయ్యడం నేర్పే పుస్తకాలేమైనా ఉంటాయేమోనని ఎంక్వయిరీ చేశాను.... ఏం... తప్పా?''

బుచ్చిబాబు అలా అడుగుతుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు పవన్‌కి.

''అలాంటి పన్లు చెయ్యమని చెప్పానే తప్ప అలాంటి పుస్తకాలు మార్కెట్లో ఉంటాయని నేనేం చెప్పలేదుగా?'' అన్నాడు అంతకన్నా ఏమనాలో తోచక.

బుచ్చి ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తూ ఉండి పోయాడు.

అతని సమస్య ఏమిటో పవన్‌కి తెలిసిందే కాబట్టి, ''పోనీ ఒక పన్జెయ్'' అన్నాడు ఏదో గుర్తు కొచ్చిన వాడిలా తల పంకిస్తూ.

''ఏమిటి?'' అన్నాడు తన రూమ్మేటూ, ఆప్తమి త్రుడూ అయినట్టి పవన్‌తో బుచ్చి.

''చెడ్డవాడిగా గుర్తింపు పొందటానికి ఇంకా చాలా చాలా పన్లు చెయ్యొచ్చు. ఉదాహరణకి జేబులు కొట్టడం చెడ్డపనే, రేపులు చెయ్యడం చెడ్డపనే, జూద మాడటం, మందు కొట్టి రోడ్డున పడటం...'' అంటూ ప్రారంభించి ఈ ప్రపంచంలో తనకి తెలిసిన చెడ్డ పన్లన్నింటినీ ఏకరువు పెట్టాడు పవన్.

దాంతో తన ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోయినట్టే అనిపించి తెగ సంబరపడిపోయాడు బుచ్చి.

ప్రపంచంలో ఇన్ని చెడ్డ పనులున్నప్పుడు అందులో కొన్నిట్నయినా తను చెయ్యలేకపోతాడా అన్న ధీమా అతన్నలా సంబరపడేలా చేసింది.

* * *

మర్నాడు బుచ్చిబాబు సిటీబస్‌లో ప్రయా ణిస్తూ, తన పక్కవాడి జేబు కొట్టాలనుకున్నాడు. కానీ కొట్టలేకపోయాడు. పైగా టికెట్ కొనడానికి



## ముద్దులు - హద్దులు

ఇవాళంటే సినిమాల్లో ముద్దులు సాధారణమయి పోయాయిగానీ గతంలో చాలా కఠిన నిబంధనలు వుండేవి. సినిమాల్లో అసలు ముద్దులు వుండొచ్చా లేదా అన్నది పరిశీలించేందుకు ప్రభుత్వం అరవైల చివరిలో ఖోస్లా కమిటీ వేసింది. ఆ కమిటీ తీవ్ర తర్జనభర్జనలు జరిపి సన్నివేశం బాగా డిమాండ్‌చేస్తే సినిమాల్లో ముద్దులు అనుమతించవచ్చని సిఫార్సుచేసింది. అప్పటికే ఒక హిందీ సినిమాలో ముద్దు సన్నివేశం వచ్చింది. ఆ కథలో నాయిక సోనియాసాహిణి కథరీత్యా పోర్చుగీసు యువతి. నాయకుడు ఐ. ఎస్. జోహార్ ఆమెను ఒక సన్నివేశంలో ముద్దు పెట్టుకుంటాడు. ఆమె విదేశీ యువతి కాబట్టి తప్పేంలేదన్నాడు అతను సెన్సారువారితో. వాళ్లు కూడా అంతే అంతే అన్నారు. రాజ్‌కపూర్ సంగం తీసినపుడు వైజయంతిమాలకు, తనకు మధ్య కొన్ని హాట్ సీన్లు తీశాడని పత్రికలు రాశాయి. వాటిల్లో చుంబనాలు కూడా వున్నాయని చెప్పాయి. అయితే, అవన్నీ విదేశీ వెర్షన్‌కు మాత్రమే పరిమితం అని కూడా చెప్పాయి. దేశవాళీ ప్రేక్షకులంతా తమ దురదృష్టానికి చింతిస్తూ కడవలకొద్దీ కన్నీరు కార్చారు.

అతని దగ్గర ఓ రూపాయి తక్కువపడితే కండక్టర్ అతన్ని నానామాటలు అంటుంటే పోనీలే పాపమని ఆ రూపాయి బుచ్చి సర్దాడు, ఆ తర్వాత రూమ్‌కొచ్చి 'ఎవర్నో ఒకర్ని రేప్ చేస్తే ఎలా ఉంటుందా?' అని చాలా తీవ్రంగా ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అది తనవల్ల కాని పనే అనిపించింది అతనికి. ఎందుకంటే బుచ్చికి స్త్రీలంటే వల్లమాలిన గౌరవం, అలాంటిది కేవలం చెడ్డ పేరు తెచ్చుకోవడం కోసం ఏ స్త్రీనైనా అతనెలా రేప్ చెయ్యగలడు? ఇంపాజిబుల్!

అంచేత ఆ ఆలోచన్ని మనసులోంచి తోసేసి పోనీ జూదమాడి చూద్దాం అనుకున్నాడు. కానీ, ఏ జూదమాడాలో, ఎక్కడికెళ్ళాలో. అతనికి అర్థం కాలేదు. ఆడ్డానికసలు బుచ్చికి జూదమంటూ ఏదైనా తెలిస్తేగా? వస్తేగా??

సో... అదీ తనవల్ల కాదనుకున్నాడు. నెక్స్ట్... 'ఇక మందే శరణ్యం' అనుకున్నాడు... సమీపంలో ఉన్న ఓ వైన్‌షాప్‌కెళ్ళి ఓ క్వార్టర్ బాటిల్ విస్కీకొనుక్కొచ్చుకున్నాడు. మూత విప్పడం వరకూ బాగానే విప్పాడు. ఆ తర్వాత అందులోని ద్రవాన్ని వాసన చూసేసరికే బుచ్చికి కడుపులోంచి తెర్లుకొచ్చింది. దాంతో భళ్లున డోకేసుకుని, విస్కీబాటిల్ని కిటికీలోంచి చెత్తకుప్పమీదపడేలా విసిరేశాడు.

దాని తర్వాత పవన్ చెప్పిన అనేకానేక చెడ్డ పన్లన్నింటినీ మనసులో మననం చేసుకున్నాడు.

కానీ అందులో ఏ ఒక్కటీ తను చెయ్యగలిగేదిగా బుచ్చికి అనిపించలేదు.

బుచ్చిని పూర్తిగా నిరాశ ఆవహించేసింది.

'ప్చ్... లాభం లేదు... తను చెడ్డపన్లు చెయ్యడానికి ఎంత మాత్రం తగినవాడు కాదు. జీవితాంతం ఇంక ఈ క్షభనిలా అనుభవిస్తూ ఉండాల్సిందే...' అనుకున్నాడు బాధగా.

* * *

ఆ రాత్రి- దిగులుగా ఉన్న బుచ్చిని అడిగాడు పవన్

''ఏంట్రా... అలా ఉన్నావ్? చేశావా- ఇవ్వాళేదైనా చెడ్డపని? ప్రయత్నించావా అసలు?''

''ప్రయత్నించాను కానీ...చెయ్యలేదురా...''

''ఏం ఎందుకని?''

''చేద్దామనే అనుకున్నాన్రా... ఏదో ఒక చెడ్డపని చేసి తీరాలనే అనుకున్నాడు... కానీ, నా వల్ల కాలేదురా...''

''అదే... మంచివాడి వీక్నెస్... మంచివాడెప్పుడూ తెలిసితెలిసి ఒక్క చెడ్డపని కూడా చెయ్యలేడు...''

''అంతేనంటావా?'' జాలిగా అడిగాడు బుచ్చి

''ముమ్మాటికీ అంతే...'' అన్నాడు పవన్.

''మరైతే జీవితాంతం నాకీ క్షోభ తప్పదంటావా?''

''నీ పిచ్చిగానీ బుచ్చీ! ఇందులో నువ్వు క్షోభించాల్సింది ఏముందిరా? 'పాపం పిచ్చివాడు' అనేది 'మంచివాడు' అనే దానికి పర్యాయపదం లాంటిది...''

''అదే కదరా నా బాధ. నన్ను చూసి అందరూ 'పాపం పిచ్చి వాడు', 'ఆ బుచ్చికి ఉత్త పిచ్చి' అంటుంటే చెడ్డవాడు గా గుర్తింపు పొందాలనీ నేను ఆరాటపడుతోంది...''

''నువ్వెంత ఆరాటపడినా నువ్ చెడ్డపన్లు చెయ్యనూ లేవు... చెడ్డవాడిగా గుర్తింపు పొందనూ లేవు.... ఎందుకంటే... నువ్ మంచివాడివి కాబట్టి. చెడ్డపనులు చెయ్యకపోవడమే కదా మంచితనమంటే...''

పవన్ అలా అంటుంటే అతనికేసి దీనంగా చూశాడు బుచ్చి.... ఇంకో ఉపాయం లేదా... అన్నట్టు.

''అంతేనంటావా?'' అన్నాడు ఎంతో నీరసంగా.

''అంతే...'' అన్నాడు పవన్ స్థిరంగా. అంతే బుచ్చి ఇంకేమీ మాట్లాడకుండా ముసుగు తన్నేసి పడుకున్నాడు- గుడ్ల నీరు కుక్కుకుని!

పవన్ ఆ ముసుగు తీసి జాలిగా చూస్తూ

''పాపం ఉత్త పిచ్చి వెధవ! ఎలా బ్రతుకుతాడో, ఏమో...'' అనుకున్నాడు బాధగా, అభిమానంగా!

★

